# సాక్షి కామారెడ్డి

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025




## ఓం నమఃశివాయ

మహాశివరాత్రి వేడుకలకు జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. మహాశివుడికి ప్రత్యేక పూజలు చేసేందుకు బుధవారం తెల్లవారు జామునుంచే తరలిరానున్న భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. పూజాసామగ్రి, పండ్ల విక్రయాలు మార్కెట్‌లో జోరుగా సాగాయి.





నస్రుల్లాబాద్ మండలం దుర్కిలోని సోమలింగేశ్వరాలయం

# రేపే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు తంటాలు
- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- ఓటర్లు : పట్టభద్రులు – 16,410.. టీచర్లు – 2,011
- మొత్తం 54 పోలింగ్ కేంద్రాలు
- ప్రచారం ముగిసింది.. ప్రలోభాలకు తెరలేచింది!

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు నానాతంటాలు పడిన ప్రధాన పార్టీల, సంఘాల అభ్యర్థులు, నాయకులు ప్రచార గడువు ముగిసిన వెంటనే ప్రలోభాలకు తెరలేపారని.. ఒక్కో ఓటుకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు పంపిణీ చేశారనే చర్చ సాగుతోంది. మరోవైపు పోలింగ్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 25 మండలాల్లో పట్టభద్రుల, ఉపాధ్యాయల నియోజకవర్గ ఎన్నికల కోసం మొత్తం 54 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైంది. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. జిల్లాలో పట్టభద్రులు 16,410 మంది, ఉపాధ్యాయులు 2,011 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని మొత్తం 25 మండలాల్లో ఉపాధ్యాయులకు సంబంధించి 25 పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రులకు సంబంధించి 29 పోలింగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది బుధవారం సాయంత్రం వరకు కేంద్రాలకు చేరుకోనున్నారు. పోలింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ సింధుశర్మ ఆధ్వర్యంలో పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాట్లు చేసింది.

**పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు ఇవే..**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగు కేంద్రాలు బాన్సువాడ పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల రూం నంబర్1లో, నస్రుల్లాబాద్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, బీర్కూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మద్నూర్‌లోని ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డోంగ్లీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జుక్కల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బిచ్కుందలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, పెద్దకొడప్‌గల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ మీడియం, పిట్లంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ మీడియం, నిజాంసాగర్‌లో ఎంపీడీవో కార్యాలయం, మహ్మద్‌నగర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భిక్కనూరులోని జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్, బీబీపేటలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, దోమకొండలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కామారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నాలుగు కేంద్రాలు, కామారెడ్డి డిప్యూటీ డీఈవో కార్యాలయ భవనంలో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. మాచారెడ్డిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాల్వంచంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, రాజంపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, రామారెడ్డిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, సదాశివనగర్‌లోని జెడ్పీ హైస్కూల్, తాడ్వాయిలోని జెడ్పీ హై స్కూల్‌లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. గాంధారిలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, లింగంపేటలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో, నాగిరెడ్డిపేటలో జెడ్పీ హైస్కూల్ గోపాల్‌పేటలో, ఎల్లారెడ్డిలో మున్సిపల్ మీటింగ్ హాలులో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాలు..**

ఉపాధ్యాయుల కోసం జిల్లాలో 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాన్సువాడలోని బాలికల ఉన్నత పాఠశాలలో, నస్రుల్లాబాద్‌లో ప్రాథమిక పాఠశాల, బీర్కూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దోంగ్లీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మద్నూర్‌లో జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం హైస్కూల్, జుక్కల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో, బిచ్కుందలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో, పెద్ద కొడప్‌గల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో, పిట్లంలోని జెడ్పీ హైస్కూల్‌లో, మహ్మద్‌నగర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో, నిజాంసాగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో, భిక్కనూరులోని జెడ్పీ హైస్కూల్‌లో, బీబీపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో, దోమకొండలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో, మాచారెడ్డిలోని జెడ్పీ హైస్కూల్‌లో, పాల్వంచంలోని జెడ్పీ హైస్కూల్, రాజంపేటలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, రామారెడ్డిలోని బాలుర ఉన్నత పాఠశాల, సదాశివనగర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల, తాడ్వాయిలోని జెడ్పీ హైస్కూల్‌లో, గాంధారిలో జెడ్పీ హైస్కూల్‌లో, లింగంపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో, నాగిరెడ్డిపేటలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాల, ఎల్లారెడ్డిలోని మున్సిపల్ మీటింగ్ హాల్‌లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.



పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న పట్టభద్రుడు

### పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 94

కామారెడ్డి టౌన్: మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం సంబంధించి కామారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో 94 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం జిల్లాలో 126 మంది దరఖాస్తు చేసుకోగా రెండు రోజుల వ్యవధిలో 94 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

### ఊపందుకున్న ప్రలోభాలు!

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. అయితే ఓటర్లను ప్రలోభాల్లో ముంచుతున్న ప్రచారం ఊపందుకుంది. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెట్టుబడిదారులు, వ్యాపార వేత్తలు బరిలో నిలవడంతో సహజంగానే ఎన్నికలు కాస్ట్‌లీగా మారాయి. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు, ప్రధాన సంఘాలు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. ఓటుకు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

**ఉపాధ్యాయ ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు**

| డివిజన్ | మండలాలు | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| కామారెడ్డి | 10 | 10 | 824 | 507 | 00 | 1,331 |
| ఎల్లారెడ్డి | 04 | 04 | 109 | 54 | 00 | 163 |
| బాన్సువాడ | 11 | 11 | 374 | 143 | 00 | 517 |
| మొత్తం | 25 | 25 | 1,307 | 704 | 00 | 2,011 |

**గ్రాడ్యుయేట్స్ ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు**

| డివిజన్ | మండలాలు | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| కామారెడ్డి | 10 | 14 | 6,271 | 3,078 | 01 | 9,350 |
| ఎల్లారెడ్డి | 04 | 04 | 2,022 | 633 | 00 | 2,655 |
| బాన్సువాడ | 11 | 11 | 3,323 | 1,082 | 00 | 4,405 |
| మొత్తం | 25 | 29 | 11,616 | 4,793 | 01 | 16,410 |

## డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తిచేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అన్ని వసతులు కల్పించడంతోపాటు ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలోని అనంతరం పోలింగ్ నిర్వహణకు వినియోగించే సామగ్రిని, బ్యాలెట్ బాక్సులను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు 48 మంది ప్రిసైడింగ్ అధికారులు, 48 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 116 మంది ఓపీవోలను నియమించినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు వి విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో మసూద్ అహ్మద్, కామారెడ్డి తహసీల్దార్ జనార్దన్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ అనిల్ తదితరులు ఉన్నారు.

## పటిష్ట బందోబస్తు

కామారెడ్డి టౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ సింధుశర్మ తెలిపారు. ఎనిమిది స్ట్రైకింగ్ ఫోర్స్, మరో ఎనిమిది స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీములను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ బూత్ ల వద్ద స్టాటిస్టికల్ సిబ్బంది ఉంటారని తెలిపారు. నలుగురు డీఎస్పీలు, 80 మంది సీఐలు, 33 మంది ఎస్సైలు, 58 మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 174 మంది కానిస్టేబుళ్లు, 35 మంది హోంగార్డులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 163(బీఎన్ఎస్ఎస్) యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు ఉంటాయని, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని, అవాంఛనీయ ఘటనలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సాగేలా సహకరించాలని ఎస్పీ కోరారు.



## న్యూస్‌రీల్

### చట్టాలపై అవగాహన ఉండాలి



కామారెడ్డి టౌన్ : ప్రతి ఒక్కరు న్యాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి టి నాగరాణి అన్నారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మహిళలకు న్యాయ చైతన్య సదస్సు కార్యక్రమం నిర్వహించారు. లైంగిక వేధింపుల నిరోధక చట్టం(పోష్)పై అవగాహన కల్పించారు. ఉద్యోగాలు చేసే ప్రతి మహిళ పోష్ చట్టం గురించి తెలుసుకోవాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, సీడబ్ల్యూసీ సభ్యులు స్వర్ణలత, డీడబ్ల్యూవో సూపరింటెండెంట్ అరుణ్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది సాయిప్రణీత్, శ్రవణ్, మహిళలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఇంటర్ లింకింగ్ పనుల పరిశీలన



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఒకటో సబ్‌స్టేషన్ నుండి కాకతీయనగర్ సబ్‌స్టేషన్ 33కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ పనులను ఎస్ఈ శ్రావణ్‌కుమార్ మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ లింకింగ్ పనులను వారంలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చిన్నమల్లారెడ్డి సబ్‌స్టేషన్‌పై ఓవర్ లోడ్ సమస్య తగ్గి హౌసింగ్‌బోర్డు, నర్సన్నపల్లి, చిన్నమల్లారెడ్డి, రాజంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు స్థిరమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. వేసవిలో విద్యుత్ అధిక వినియోగం నేపథ్యంలో సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, 45 సబ్‌స్టేషన్‌లలో కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా సాంకేతిక నష్టాలు గణనీయంగా తగ్గుతాయని ఎస్ఈ పేర్కొన్నారు. ఆయన వెంట ఏడీఈలు, ఏఈలు ఉన్నారు.

### మండలిలో న్యాయవాదుల గళం వినిపిస్తాం



కామారెడ్డి టౌన్: న్యాయవాదుల సంరక్షణ చట్టం కోసం ప్రయత్నం చేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపిస్తే న్యాయవాదుల తరఫున ప్రభుత్వంతో కలిసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టభద్రులైన న్యాయవాదులు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపితే శాసనమండలిలో న్యాయవాదుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా గళం వినిపిస్తామని అన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు దేవరాజు, చింతలగోపి, నందకిశోర్, మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి



బోధన్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా డ్రైవర్లు, కండక్టర్లు కృషి చేయాలని నిజామాబాద్ ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు పవర్(పీక్ పర్ఫార్మెన్స్ త్రో ఓనర్‌షిప్ విత్ ఎంపతి అండ్ రిసాల్వ్) అనే అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అంకితభావంతో పని చేసి సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం శ్రీనివాస్, ఏఈ శ్రావణ్, ఎస్టీఐ లక్ష్మణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అర్థం చేసుకుని సహకరిస్తున్నాం

- సీపీఎస్ రద్దుపై త్వరలో సబ్ కమిటీ రిపోర్టు
- ఏప్రిల్‌లో ప్లాటినం జూబ్లీ నిర్వహిస్తాం
- ఉద్యోగులందరూ ఎమ్మెల్సీ ఓటు వేయాలి
- టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

కామారెడ్డి అర్బన్ : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేని విషయాన్ని ఉద్యోగులుగా తాము అర్థం చేసుకుని సహకరిస్తున్నామని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. కామారెడ్డిలోని టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగదీశ్వర్ మాట్లాడారు. ఏప్రిల్‌లో మరో డీఏ బకాయిలు, వేతన సవరణ నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు అనేక సమస్యలున్నాయని కొత్త జిల్లాల్లో ఇంకా ఉద్యోగుల సర్దుబాటు పూర్తి కాలేదన్నారు. ఆర్థిక భారం లేని నిర్ణయాల అమలు, రూ.లక్ష లోపు పెండింగ్ బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. సీపీఎస్ రద్దుపై సబ్ కమిటీ రిపోర్టు త్వరలో వస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, వాటి అమలులో బాధ్యతగా పనిచేయడమే తమ విధానమని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు, ఐదు డీఏలు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు తదితర అంశాలపై రాష్ట్రంలోని 206 సంఘాలు జేఏసీగా ఏర్పాటు కావడం తొలిసారని, పక్కా ప్రణాళికతో సమస్యలను పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు ప్రతినెల ఒకటో తేదీన జీతాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. టీఎన్జీవోస్ ఏర్పడి 80 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఏప్రిల్‌లో హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో 60వేల మంది ఉద్యోగులతో ప్లాటినం జూబ్లీ నిర్వహిస్తామన్నారు. పట్టభద్రుల ఓటు హక్కు ఉన్న ఉద్యోగులందరూ తప్పనిసరిగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి ముల్క నాగరాజు, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు రాజ్‌శ్రీనివాస్, కొల శ్రీనివాస్, సుమన్‌కుమార్, నాగేందర్‌రెడ్డి, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

# ఓటు ప్రాధాన్యత తగ్గించొద్దు

**ఒక్క ఓటూ కీలకమే !**

- ప్రాధాన్యత క్రమంలో అందరికీ ఓటేయొచ్చు
- చిన్న నిర్లక్ష్యంతో చెల్లకుండాపోయే అవకాశం
- బ్యాలెట్ పత్రంలో పేరు, ఫొటో తరువాతి బాక్సులో అంకె వేయాలి




సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : 2009లో జరిగిన ఉమ్మడి నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో కొందరు ఓటర్లు చేసిన చిన్న చిన్న పొరపాట్లు అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపాయి. అప్పుడు కాంగ్రెస్ నుంచి వెంకట్రామ్‌రెడ్డి, టీడీపీ నుంచి నర్సారెడ్డి పోటీ చేశారు. ఇద్దరి మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఓట్ల లెక్కింపులో వెంకట్రామ్‌రెడ్డి మూడు ఓట్ల లీడింగులో ఉండగా, కొన్ని ఓట్లు చెల్లనివిగా గుర్తించి ఎన్నికల్లో నర్సారెడ్డిని విజేతగా ప్రకటించారు. దీనిపై వెంకట్రామ్‌రెడ్డి హైకోర్టుకు, తరువాత సుప్రీంకోర్టుకూ వెళ్లారు. ఒక సందర్భంలో వెంకట్రామ్‌రెడ్డిని విజేతగా ప్రకటించినా లాభంలేకుండాపోయింది. ఓటు వేసిన వారు పొరపాట్లు చేయకుండా ఉండి ఉంటే వెంకట్రామ్‌రెడ్డి విజేతగా నిలిచేవారు.

ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు మరికొన్ని గంటల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆయా పార్టీలు, సంఘాల అభ్యర్థులు ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు తమకే వేయాలంటూ అభ్యర్థించారు. అయితే ప్రాధాన్యత ఓటు విషయంలో చాలా మందికి సందేహాలుంటాయి. ఎందుకంటే అసెంబ్లీ, పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలకు, శాసన మండలి ఎన్నికలకు ఎంతో తేడా ఉంటుంది. మండలి ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌లో ఉన్న అందరు అభ్యర్థులకు ఓటు వేయొచ్చు. అయితే ఒకరికి ఒకటో ప్రాధాన్యం వేయాలి. ఇంకొకరికి రెండో ప్రాధాన్య ఓటు వేయొచ్చు. కానీ ఇద్దరికీ ఒకటే వేస్తే ఓటు చెల్లకుండాపోతుంది. మొదట తాము ఎవరికి ఓటు వేయాలనుకుంటున్నారో వారికి సంబంధించిన కాలమ్‌లోని బాక్సులో 1 అంకె వేయాలి. అంటే మొదటి ప్రాధాన్యత ఆ అభ్యర్థికి ఇచ్చినట్టు అవుతుంది. పోటీలో ఉన్న అందరికీ 1 అంకె వేస్తే ఓటు చెల్లకుండాపోతుందని గుర్తించాలి. అలాగే అంకెల్లో కాకుండా అక్షరాలు రాస్తే ఓటు చెల్లకుండాపోతుంది. ఓటు వేసే క్రమంలో బ్యాలెట్ పేపర్‌పై ఏది పడితే అది రాయడం కూడా తప్పే. బ్యాలెట్ పేపర్‌పై నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో ఓట్లు వేయాలి తప్ప, ఇష్టం ఉన్నట్టు రాస్తే ఓటు మురిగిపోక తప్పదు.

**నీ ఓటు.. గెలుపోటములను ఖరారు చేయొచ్చు**


ఒక్కోసారి ఒకే ఓటుతో అభ్యర్థుల తలరాతలు మారిపోతాయి. అందుకే ఒక్క ఓటూ కీలకమే. ఉపాధ్యాయ ఎమ్మెల్సీతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ప్రతి ఓటుకూ ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. అభ్యర్థులు హోరాహోరీ ప్రచారం నిర్వహించారు. అయితే ఓట్లు వేసేటపుడు జాగ్రత్తలు పాటించకుంటే అభ్యర్థుల గెలుపు ఓటములపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే ప్రతి ఓటరూ జాగ్రత్తగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

**ఇవి గుర్తుంచుకోవాలి..**

- ఓటు వేసేందుకు వెళ్తున్న వారు ప్రభుత్వం నుంచి పొందిన ఏదేని గుర్తింపు కార్డు తమ వెంట తీసుకువెళ్లాలి. ఓటరు జాబితాలో పేరు, క్రమ సంఖ్య ముందే చూసుకుని కేంద్రానికి వెళ్తే సులువవుతుంది.
- బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉంటాయి. ఎవరికైతే ఓటు వేయాలనుకుంటున్నారో ముందుగా వారి ఫొటో, పేరు ఎదురుగా ఉన్న బాక్స్‌లో 1 అంకె వేయాలి. తరువాత ప్రాధాన్యత ఎవరికి ఇవ్వాలనుకుంటున్నారో వారి పేర్లు, ఫొటోలు చూసుకుని 2,3,4,5.. ఇలా సీరియల్‌గా వేయొచ్చు.
- పోలింగు సిబ్బంది సూచించినవిధంగా బ్యాలెట్ పత్రాన్ని ఫోల్డ్ చేసి బాక్సులో వేయాలి.

# బీఆర్ఎస్ ఓట్లు ఎవరికి..!

- ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై చర్చోపచర్చలు
- రెండు స్థానాలకూ త్రిముఖ పోరే?



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముగింపు దశలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అన్ని వర్గాల్లో చర్చోపచర్చలకు తావిచ్చాయి. బీఆర్ఎస్ పార్టీ ఓట్లు ఎవరికి వేయాలని చెబుతోందని రేవంత్‌రెడ్డి అన్న మాటలు కాక పుట్టించాయి. పోలింగ్‌కు ముందు చేసిన ఈ వ్యాఖ్యలు ప్రధాన పార్టీల శ్రేణుల్లో వేడి కలిగించాయి. రాష్ట్రంలో ప్రధాన పార్టీలుగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో బీజేపీ మాత్రమే రెండు స్థానాలకూ అభ్యర్థులను బరిలో దించింది. కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థిని మాత్రమే దించగా, బీఆర్ఎస్ ఒక్క అభ్యర్థినీ బరిలోకి దించలేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌పై విమర్శల దాడి చేసిన ముఖ్యమంత్రి, పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎవరికి ఓట్లేయమని చెబుతోందని ప్రశ్నించారు. దీంతో అన్ని వర్గాల్లో చర్చ జరుగుతోంది.

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లు మొత్తం 3,55,159 ఉన్నాయి. 56 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి చిన్నమైల్ అంజిరెడ్డి, కాంగ్రెస్ నుంచి వూట్కూరి నరేందర్‌రెడ్డి ప్రధాన పోటీదారులుగా ఉండగా, బీఎస్పీ నుంచి బరిలో నిలిచిన ప్రసన్న హరికృష్ణ సైతం గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ ముగ్గురి మధ్య త్రిముఖ పోరు నెలకొన్నట్లు పలువురు విశ్లేషిస్తున్నారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి సర్దార్ రవీందర్‌సింగ్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి బక్క జడ్సన్ పోటీలో ఉన్నప్పటికీ అంజిరెడ్డి, నరేందర్‌రెడ్డి, హరికృష్ణ మధ్యే పోరు నెలకొంది. బీఆర్ఎస్ నుంచి అభ్యర్థి లేకపోవడంతో ఆ పార్టీ సానుభూతిపరుల ఓట్లు ఎవరి గెలుపోటములను ప్రభావితం చేస్తాయనే అంశంపై ఆసక్తి నెలకొంది.
- ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓట్లు మొత్తం 27,088 ఉన్నాయి. 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. బీజేపీ నుంచి మల్క కొమరయ్య బరిలో ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి అభ్యర్థులను నిలపలేదు. ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూ నుంచి వంగ మహేందర్‌రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో రఘోత్తంరెడ్డి పీఆర్‌టీయూ తరఫున గెలుపొందారు. తాజా ఎన్నికల్లో వీరిద్దరి మధ్య ఓట్లు చీలుతాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. త్రిముఖ పోటీ నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ సానుభూతిపరులు ఎవరికి ఓట్లు వేస్తారనే విషయమై సైతం ఆసక్తి నెలకొంది. ఈ స్థానంలో మాజీ ఇంటర్మీడియట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎల్ సుహాసిని సైతం పోటీ పడుతున్నారు.

## క్లుప్తంగా

### అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలి



**కామారెడ్డి టౌన్:** జుక్కల్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ వినోదపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఐసీడీఎస్ పీడీ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గతంలో ఆమె విధులు నిర్వహించిన డోంగ్లీ, మద్నూర్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను వేధింపులకు గురిచేస్తే ఉన్నతాధికారులు పనిష్మెంట్‌గా జుక్కల్‌కు బదిలీ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం జుక్కల్‌లో కూడా ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రాజనర్సు తదితరులున్నారు.

### తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



**నిజాంసాగర్(జుక్కల్):** ఎండలు మండుతుండటంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఉమ్మడి మండలాల ఎంపీడీవోలు గంగాధర్, అనిత సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో సింగిల్‌ఫేజ్, త్రీఫేజ్ బోరు మోటార్ల మరమ్మతులపై దృష్టి పెట్టాలన్నారు. నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు.

### మద్యం పట్టివేత

**ఎడపల్లి:** మండలంలోని కుర్నాపల్లిలో ఉన్న ఓ దాబాలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. దాబాలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 29 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. దాబా నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# పకడ్బందీగా వార్షిక పరీక్షలు

- మార్చి 5 నుంచి ఇంటర్మీడియట్..
- 21 నుంచి ఏప్రిల్ 4 వరకు ఎస్సెస్సీ ఎగ్జామ్స్
- పరీక్షల సమయంలో బస్సులు నడపాలి
- సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి క్రైం:** ఇంటర్మీడియట్, పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 38 సెంటర్లలో 8,743 మంది మొదటి సంవత్సరం, 9,726 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. 38 మంది చీఫ్ సూపరింటెండెంట్, 38 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, ఆరు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు వివరించారు. అలాగే ఎస్సెస్సీ పరీక్షలను 64 కేంద్రాల్లో నిర్వహించనుండగా, 12,579 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. 16 వొకేషనల్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్, 12 సిట్టింగ్ స్క్వాడ్, 698 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు వివరించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామీణ, ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు పరీక్షల సమయానికి సెంటర్లకు చేరుకునేందుకు బస్సులను ఆయా రూట్లలో నడపాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి విక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం, జిల్లా విద్యాశాఖాధికారి రాజు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, విద్యుత్ ఎస్ఈ శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ, పోస్టల్, ట్రెజరీ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓటమి భయంతోనే సీఎం సభలు



మద్నూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ డీకే అరుణ, పక్కన మాజీ ఎంపీ బీబీపాటిల్, తదితరులు

- బీజేపీ ఎంపీ, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

**మద్నూర్/బిచ్కుంద(జుక్కల్):** గతంలో ఏ సీఎం కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహిరంగ సభలు పెట్టి ప్రచారం చేయలేదని, ఓటమి భయంతోనే మూడు జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారని మహబూబ్‌నగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విమర్శించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని అన్నారు. మద్నూర్, బిచ్కుందలలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై పోరాడేది బీజేపీ నేతలేనని పేర్కొన్నారు.

**ప్రశ్నించే గొంతుకలవుతారు..**

బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీలను గెలిపిస్తే శాసన మండలిలో మీ కోసం ప్రశ్నించే గొంతుకలవుతారని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలు, ఇచ్చిన వాగ్దానం అమలు చేయలేదని, ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. రాష్ట్ర ఖజానాతో ప్రభుత్వం నడవడం లేదు.. కేంద్ర నిధులతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నడుస్తుందని అన్నారు. మోదీ ప్రభుత్వం బాగుందని దేశ ప్రజలు మూడు సార్లు బ్రహ్మరథం పట్టారు.. మొన్న ఢిల్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు సున్నాతో బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. గెలిచిన ఎమ్మెల్యేలు ఏమీ చేయడం లేదు.. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీలు గెలిచినా ఓడినా ఒరిగేదేమీ లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే అరుణతార, నేతలు చిన్నరాజులు, తుకారాం, పెద్దోళ్ల గంగారెడ్డి, రాము, శెల్పల్లి విష్ణు, ఈశ్వరప్ప, అభినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల పరిశీలన



బీబీపేటలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్

**బీబీపేట:** మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండలకు ఉపాధి హామీ కూలీలు ఉదయం తొందరగా రావాలని, ఎండలు ముదురుతున్న కొద్దీ పనుల వద్ద జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ తదితరులున్నారు.

**నాగిరెడ్డిపేట పరిధిలో..**

**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** మాల్తుమ్మెద, తాండూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన నర్సరీ, పశువులపాక నిర్మాణ పనులను మంగళవారం అదనపు డీఆర్‌డీవో వామనరావు పరిశీలించారు. నర్సరీలతోపాటు పశువులపాక నిర్మాణ వివరాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, ఇన్‌చార్జి ఏపీవో సాయిలు, టీఏ సంగీత, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఎఫ్ఏ సాయిలు ఉన్నారు.



పశువులపాక వద్ద ఏర్పాటు చేసిన నీటి తొట్టిని పరిశీలిస్తున్న అదనపు డీఆర్‌డీవో వామనరావు

### కూలీల శాతాన్ని పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ

**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి కూలీల శాతాన్ని పెంచాలని ఎంపీడీవో సయ్యద్‌సాజిద్‌అలీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బందికి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో 50 నుంచి 150 మంది కూలీలు పనికి రావాలని, అందుకు అణుగుణంగావారికి పనులు కల్పించే బాధ్యత మనపై ఉందన్నారు. 20 మందికి కన్నా తక్కువ కూలీలున్నట్లయితే సంబంధిత ఫీల్డు అసిస్టెంటులకు మెమో జారీ చేస్తామని హెచ్చరించారు. ఇన్‌చార్జి ఏపీవో కృష్ణ గౌడ్, ఎంపీవో సవితారెడ్డి, టెక్నికల్ అసిస్టెంటు మహిపాల్‌రెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి



ఎస్ఈతో యూనియన్ నేతలు

**కామారెడ్డి టౌన్:** విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఆర్టిజన్, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(యూఈఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి, జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రావణ్ కుమార్‌ను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో యూనియన్ ఆధ్వర్యంలో ఎస్ఈతో సమావేశమయ్యారు. కార్మికులకు పనిభారం తగ్గించాలని, 8 గంటల డ్యూటీలు వేయాలని కోరారు. ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు చంద్రారెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి మోహన్, నాయకులు సునీల్, రవి తదితరులు పాల్గొన్నారు.

# శ్రామిక వర్గ దృక్పథం కలిగిన వారిని గెలిపిద్దాం

- టీపీటీఎఫ్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల పిలుపు

**సాక్షి ప్రతినిధి, కామారెడ్డి:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ప్రతినిధులను ఎన్నుకునేందుకు జరుగుతున్న ఎన్నికల్లో ఒక వైపు ఉపాధ్యాయ ఉద్యమాల్లో పనిచేసిన శ్రామికవర్గ దృక్పథం కలిగిన అశోక్‌కుమార్, మరోవైపు శ్రమను దోచుకుని సంపన్నులైన విద్యావ్యాపారులు పోటీలో ఉన్నారని.. ఓటర్లుగా ఉపాధ్యాయులు ఎవరివైపు నిలబడతారో నిర్ణయించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ అనిల్‌కుమార్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్‌లు ఒక ప్రకటనలో కోరారు. అందరికీ సమానమైన నాణ్యమైన విద్యావకాశాలు అందించేందుకు తాము ఏం చేశామో, ఏం చేస్తామో చెప్పకుండా సంపన్న వర్గాల ప్రయోజనాలు, పెట్టుబడిదారీ కాంట్రాక్ట్ వ్యవస్థల ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నవారు ఎమ్మెల్సీలుగా ఎన్నికైతే జరిగే నష్టమేమిటో ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపైనే కాకుండా సామాజిక సమస్యలపై, తెలంగాణ రాష్ట్ర సాధనకై అలుపెరుగని పోరాటం చేసిన అశోక్ కుమార్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

### 'ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి'

**కామారెడ్డి అర్బన్:** ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యా వినాశానాన్ని కోరుకుంటున్నట్టుగా ఉన్న విషయం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తీరు స్పష్టం చేస్తుందని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.హన్మంత్ రెడ్డి, పి.విజయరామరాజులు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా, రాజకీయ పార్టీలకు అనుబంధంగా ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలున్నాయని, ఈ విషయాన్ని గ్రహించి డబ్బులకు ఓటు అమ్ముకోకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

### స్థలం కబ్జా చేసిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి



**కామారెడ్డి టౌన్:** తమ స్థలాన్ని కబ్జా చేసిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రానికి చెందిన బాధితులు వాపోయారు. మంగళవారం 11 మంది బాధితులు జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లేఅవుట్ నంబర్ 33/97లో 2,200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. మా స్థలంతో పాటు మున్సిపల్ ఓపెన్ స్థలాన్ని కూడా పక్కనే ఉన్న అవైస్ ఘోరి అనే వైద్యుడు కబ్జా చేసుకుని మట్టి నింపారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామని తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

### అలరించిన నృత్య ప్రదర్శనలు



**ఎల్లారెడ్డిరూరల్:** ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ పార్టీ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ గాంధీ తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. ఉపాధ్యాయులు జహంగీర్, ప్రియదర్శిని, లక్ష్మణ్‌సింగ్, బల్వంత్‌రావు, విద్యారమణ తదితరులున్నారు.



## క్రైం కార్నర్

### ఆరు ఇళ్లలో చోరీ

**వేల్పూర్:** వేల్పూర్ మండలం అక్లూర్‌లో తాళం వేసిన ఆరు ఇళ్లలో మంగళవారం వేకువజామున దుండగులు చోరీకి పాల్పడి రూ. 50 వేల నగదు, తులం బంగారం ఎత్తుకెళ్లారు. ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. దుండగులు ఎనిమిది ఇళ్లలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆరు ఇళ్లలో నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. బాధితులు వారి ఇళ్లకు తాళం వేసి బంధువుల ఇళ్లకు వెళ్లడంతో చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. చోరీ జరిగిన గృహాలను ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి పరిశీలించి, బాధితులతో మాట్లాడారు. గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ నిందితుడు నడుచుకుంటూ వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఒకే రోజు చాలా ఇళ్లలో చోరీకి పాల్పడడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పెట్రోలింగ్ నిర్వహించి చోరీలు జరుగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**వల్లభాపూర్‌లో టీవీ..**

**మాక్లూర్:** మండలంలోని వల్లభాపూర్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దుండగులు టీవీని దొంగిలించినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన చాకలి సాయమ్మ పది రోజుల క్రితం ఆర్మూర్‌లో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లింది. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు ఇంట్లో ఉన్న టీవీ చోరీకి పాల్పడ్డారు. టీవీ విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### గొడవ కేసులో నిందితులకు పది నెలల జైలు

**రుద్రూర్:** మోస్రా మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు, ఆమె కుమారుడితో గొడవ పడి కొట్టిన కేసులో నలుగురు నిందితులకు పది నెలల జైలు శిక్ష, రూ. ఆరు వేల జరిమానాను జడ్జి సాయిశివ విధించినట్లు వర్ని ఎస్సై జి రమేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో వృద్ధురాలు, ఆమె కుమారుడిపై నిందితులు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు చార్జ్ షీట్ చేసినట్లు తెలిపారు. బాధితుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాణి వాదనలు వినిపించారు. ఆధారాలను పరిశీలించిన జడ్జి నిందితులకు పది నెలల జైలు శిక్షతో పాటు రూ. ఆరువేల జరిమానా విధించారని పేర్కొన్నారు.

### తహసీల్దార్ ఎదుట ఒకరి బైండోవర్

**లింగంపేట:** మండలంలోని భవానిపేటకు చెందిన దర్శనం ఈశ్వర్ అనే వ్యక్తి సోమవారం రాత్రి మద్యం మత్తులో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో ఎస్సై కేసు నమోదు చేసి తహసీల్దార్ నరేందర్‌గౌడ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై వెంకట్రావు మంగళవారం తెలిపారు. ఎవరైనా పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### మద్నూర్‌లో ఒకరిపై హత్యాయత్నం



**మద్నూర్:** మురుగు కాలువ విషయంలో జరిగిన గొడవ హత్యాయత్నం వరకు దారి తీసిన ఘటన మద్నూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పండరి, మాణిక్ ఇళ్ల వద్ద మురుగు కాలువ విషయంలో మంగళవారం ఉదయం గొడవ జరిగింది. పెద్ద మనుషులు వీరిని సముదాయించి శాంతింపజేశారు. పండరి గ్రామంలోని పోచమ్మ ఆలయానికి మధ్యాహ్నం వెళ్లాడు. అక్కడికి వచ్చిన మాణిక్ కత్తితో పండరిని పొడిచి పారిపోయాడు. తీవ్ర గాయాలైన పండరిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పరారీలో ఉన్న నిందితుడిని గాలిస్తున్నట్లు తెలిపారు.

# ప్రాణాలు తీసిన చేపల వేట సరదా

- పల్లెవాని కుంటలో పడి ఇద్దరు విద్యార్థుల మృతి
- ఇరు కుటుంబాల్లో విషాదచాయలు



జంగనాథం శివ (ఫైల్)



కుంభ సంతోష్ (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కటుంబ సభ్యులు

**కామారెడ్డి క్రైం:** వారిద్దరూ విద్యార్థులు.. సమీపంలో ఉంటున్న కాలనీవాసులు.. సాయంత్రం స్కూల్ ముగిశాక సరదాగా ఆడుకునేందుకు సైకిళ్లపై బయటకు వెళ్లారు. వారితో పాటు మరో ఇద్దరు స్నేహితులు కలిసి సమీపంలో ఉన్న ఓ కుంటకు వెళ్లగా అందులో సరదాగా చేపలు పడతామని యత్నించిన ఇద్దరు విద్యార్థులు నీట మునిగి చనిపోయారు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని గ్రీన్ సిటీ కాలనీ సమీపంలో కొన్ని కుటుంబాలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నాయి. వారిలో నాగరాజు కుమారుడు జంగనాథం శివ(10), కుంభ నాగేంద్ర బాబు కుమారుడు కుంభ సంతోష్(8) స్థానికంగా ఉండే ఓ పాఠశాలలో 4, 2వ తరగతులు చదువుతున్నారు. ఇద్దరు చిన్నారులు మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చి ఆడుకునేందుకు సైకిళ్లపై బయటకు వెళ్లారు. మరో ఇద్దరు స్నేహితులతో కలిసి రామేశ్వర్‌పల్లి వద్ద ఉన్న వల్లెవాని కుంటకు చేరుకున్నారు. సరదాగా చేపలు పడుతూ శివ, సంతోష్ కుంటలోని నీటిలో పడి మునిగిపోయారు. తోటి స్నేహితులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి మృతదేహాలను బయటకు తీయించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మెట్లపై నుంచి పడి యువకుడి మృతి



ముత్యం మృతదేహం

**నందిపేట్:** మెట్లపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. నందిపేట మండల కేంద్రంలోని రాజనగర్ ప్రాంతానికి చెందిన గొల్ల చిన్న ముత్యం(25) కూలీ పనులు చేస్తూ ఒంటరిగా జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి కల్లుబట్టీలో కల్లు సేవించిన అనంతరం వైన్ షాప్‌లో మద్యం కొనుగోలు చేసి కల్లుబట్టి పక్కనే ఉన్న ఇంటిపైకి ఎక్కి మద్యం సేవించాడు. కిందికి దిగుతున్న సమయంలో మెటపై నుంచి జారి పడి మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

- మరొకరికి తీవ్రగాయాలైన ఘటన



గంగారాం మృతదేహం

**రెంజల్:** గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలైన ఘటన రెంజల్ మండలం కందకుర్తి వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన మస్నూర్ గంగారాం(64), హన్మంతు పని నిమిత్తం బైక్‌పై మంగళవారం ధర్మాబాద్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కందకుర్తి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో గంగారాం అక్కడికక్కడే మృతి చెందగా హన్మంతుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. మహాశివరాత్రి సందర్భంగా గ్రామంలో భజన చేసేందుకు అవసరమైన డోలక్‌ను ధర్మాబాద్‌లో మరమ్మతు చేయించుకుని తీసుకు వస్తుండగా ప్రమాదం జరిగింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



కడావత్ రెడ్యా మృతదేహం

**ఎల్లారెడ్డి:** కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ కట్టకింది తండాకు చెందిన కడావత్ రెడ్యా(26) ఇంట్లో గొడవ జరగడంతో మనస్తాపం చెంది గ్రామ శివారులోని తన పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

**దుబాయిలో సదాశివనగర్ వాసి ఆత్మహత్య**

**సదాశివనగర్:** మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు దుబాయిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్‌కు చెందిన గాదారి నరేశ్(28) బతుకుదెరువు నిమిత్తం ఇటీవల దుబాయికి వెళ్లాడు. కొంతకాలంగా ప్రేమించిన అమ్మాయి నరేశ్ ఫోన్ నంబర్‌ను బ్లాక్‌లో పెట్టిందనే మనస్తాపంతోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నరేశ్ మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తెప్పించాలని కుటుంబీకులు కోరుతున్నారు.

### చికిత్స పొందుతూ వివాహిత మృతి



కీర్తి మృతదేహం

**నవీపేట:** వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఈ నెల 21న పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బోడాసు వినోద్‌కుమార్‌తో మెదక్ జిల్లా చేగుంటకు చెందిన కీర్తి(34)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా భర్త వినోద్ భార్యను అదనపు కట్నం తేవాలంటూ హింసిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కీర్తిని ఎలాగైనా వదిలించుకోవాలని తరచూ వేధింపులకు గురిచేసేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన కీర్తి ఈనెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి సూర ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు వినోద్ కుమార్, అత్తలు వడ్డెవ్వ, రాగవ్వతో పాటు ఓ మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.